విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 2, సెప్టెంబర్ 2023

మెగా బిందు సేద్యం పథకాన్ని పూర్తి చేయాలి

- ఉరవకొండలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన

ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం లో 55 వేల ఎకరాలకు నీటిని అందించే సామూహిక మెగా బిందు సేద్యం పథకాన్ని తక్షణమే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని వ్యవసాయ శాఖ ఏడి కార్యాలయం ముందు సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలకు గురవుతున్న అనంతపురం జిల్లాలో తక్కువ నీటితో పంటలను పండించుకునేందుకు 2017 సంవత్సరంలో రూ.842 కోట్ల రూపాయలతో అప్పటి ప్రభుత్వం సామూహిక మెగా బిందు సేద్యం పథకాన్ని ఏర్పాటు చేసిందని 70 శాతం పనులు కూడా పూర్తి అయ్యాయని 2019 సంవత్సరంలో ప్రభుత్వం మారిన తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్సిపి పార్టీ ప్రభుత్వం ఈ పథకాన్ని మూలన పడవేసిందని ఆరోపించారు. వర్షాలు రాక మరోవైపు సాగునీరు అందక ఇబ్బందులకి గురవుతున్న రైతులకు ఈ పథకం ఒక వరం లాంటిదని అలాంటి పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శోచనీయమన్నారు. మధ్య పెన్నార్, మరియు పీఏబీఆర్ జలాశయాలు ద్వారా ఉరవకొండ మండలంలో 25,714 ఎకరాలు, జీడిపల్లి జలాశయాలు ద్వారా బెలుగుప్ప మండలంలో 12,605 ఎకరాలు, పిఏ బిఆర్ కుడి కాలువ జలాశయాలు ద్వారా కూడేరు మండలంలో 12,185 ఎకరాలు ఈ సామూహిక మెగా బిందు సేద్యం పథకం ద్వారా సాగులోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పథకం పనులలో ఇప్పటికే పంప్ హౌస్ లు నిర్మాణాలు తదితర పనులన్నీ 70% పైగా పూర్తయ్యాయని మిగిలిన పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పథకానికి సంబంధించిన సామగ్రి ఆమిద్యాల గ్రామ సమీపంలో నిరుపయోగంగా పడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతూ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ గతంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించి కలెక్టర్ కూడా కలిసి విన్నవించడం జరిగింది అన్నారు. అయినప్పటికీ కూడా ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందని ఆరోపించారు సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై సిపిఐ పార్టీ రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఏడి పద్మజాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం కార్యదర్శి జే. మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, తాలూకా సహాయ కార్యదర్శి కురుకుంట మనోహర్, సీనియర్ పార్టీ నాయకులు రామాంజనేయులు, చెన్నా రాయుడు, ఉరవకొండ మండల కార్యదర్శి తలారి మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల కార్మికులను ఆదుకోవాలి

సిపిఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున

తోపుడు బండ్ల కార్మికులతో సమావేశమైన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తోపుడు బండ్ల కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఉరవకొండ తాలూకా సిపిఐ పార్టీ కార్యదర్శి జె. మల్లికార్జున, సహాయ కార్యదర్శి గురు గుంట మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏఐటియుసి అనుబంధ తోపుడు బండ్ల కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తోపుడు బండ్ల కార్మికులపై ట్రాఫిక్ పోలీసులు వేధింపులు ఆపాలని, వారు వ్యాపారం చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని అలాగే వ్యాపారులకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయాలని పేర్కొన్నారు 60 ఏళ్లు దాటిన వ్యాపారులకు రూ.3వేల పింఛన్లు మంజు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కరువై దుకాణాలకు అద్దెలు చెల్లించలేక అనేకమంది బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారని వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తున్న వారందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి కురుగుంట మనోహర్, ఉరవకొండ మండల కార్యదర్శి మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, చెన్నరాయుడు బాలాజీ, చక్రధర్, గంగాధర్ పాల్గొన్నారు.

రైతులతో గ్రామస్థాయి సమావేశం

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని చందన గ్రామంలో ని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సంచాలకులు ఎం వెంకట రాముడు , ఏవో మహబూబ్ బాషా ఆధ్వర్యంలో రైతులతో గ్రామస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు నమోదు చేస్తున్న ఈ క్రాప్ యాప్ లో రైతులకు గాని వ్యవసాయ సిబ్బందికి కానీ ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయలన్నారు . అలాగే పిఎం కిసాన్ లో ఈ కేవైసీ, ల్యాండ్ లింకేజ్ అవ్వని రైతులను వెంటనే ఆన్లైన్ చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంపై చర్చించారు. రైతు భరోసా కేంద్రంలో రాబోవు కాలానికి ఏ ఎరువులు అవసరమో ముందుగానే చర్చించి ఎరువులు అందుబాటులో చర్యలు తీసుకోవాలన్నారు, కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా ,గ్రామ వ్యవసాయ అధికారి యతిషా ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో 42వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా సౌభాగ్య శ్రీరామ్ అపార్ట్మెంట్ సమీపంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహం ప్రతిష్ట ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేశారు. దాత దగ్గుపాటి శ్రీరాములు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటు చేయాలన్న తమ కోరిక నెరవేరబోతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక విప్లవాన్ని తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తిని ఆయన కొనియాడారు. అలాంటి మహానుభావుని విగ్రహాన్ని తన సొంత స్థలంలో ఏర్పాటు చేసుకోవడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు రామానాయుడు, పోతుల శ్రావణ్, మల్లికార్జున, మింగుట్ల జయన్న, నెట్టెం సుధాకర్, చీరల తిప్పయ్య, తమ్మినేని రామాంజనేయులు, అనిల్, దగ్గుపాటి యుగంధర్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూ షియా చేపలు విడుదల

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు మురికి నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో శుక్రవారం గంబు షియా చేపలను వదిలారు. గ్రామ సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమృతరాజు, ఉరవకొండ సీఐ హరినాథ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నచోట దోమలు గుడ్లు లార్వాలు వృద్ధి చెందకుండా ప్రజలు రోగాలబారిన పడకుండా ఉండడానికై అనంతపురం నుంచి ఫిష్ డిపార్ట్మెంట్ ద్వారా పదివేల గమ్బుషియా చేపలను ఉరవకొండ పట్టణానికి తీసుకొచ్చి వివిధ వార్డులలోని మురికి కాలువలలో వదలడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వన్నప్ప, వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున, వైసిపి నాయకులు బసవరాజు, పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, పంచాయతీ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ గ్రామపంచాయతీ సర్పంచ్ లలిత, ఉపసర్పంచ్ వన్నప్ప ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు,వికలాంగులకు వితంతువులకు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు, కష్టాల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన వారందరికీ కూడా కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా పింఛన్లను 1వ తేదీనే అందిస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి ఆయనే సీఎం గా ఉండాలని పింఛన్లు లబ్ధిదారులు అందరూ కూడా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్, వాలంటీర్లు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల పంట రుణాలు రద్దుచేయాలి...

- పెట్టుబడి సాయం ప్రతి రైతుకు ఎకరాకు 10వేలు ఇవ్వాలి..
- సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర-శింగనమల: రైతుల కోర్కెల దినోత్సవం సందర్భంగా బుక్కరాయసముద్రంలో ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున సిపిఐ శింగనమల నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామిల ఆధ్వర్యంలో ఏపీరైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటవ తేదీన జిల్లా వ్యాప్తంగా రైతు కోర్కెల దినం సందర్భంగా రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లావ్యాప్తంగా రైతు సంఘం జెండాను ఎగరవేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా కరువు అలముకుందని, రైతులు పెట్టిన పంటలు వేరుశనగ, పత్తి , కొర్ర , జొన్న, సద్ద, పలు పంటలు వేసినప్పటి నుండి వర్షాలు రాక పంటలు ఎండిపోతున్నాయని, సాగు చేయాలంటే రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని వంటలు సాగు చేస్తుంటే అప్పులు కుప్పలు తప్ప వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక రైతులు కౌలు రైతులు దిన, దినము, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. 2022సంవత్సరానికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న పాలకుల వాగ్దానాలు అమలుకు నోచుకోలేదని, రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై భారాల మోపుతున్నాయన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతిరైతుకు, కౌలు రైతుకు, ఏకరాకు 25వేలు నష్టపరిహారం అందించాలని, ప్రతి రైతుకు కౌలు రైతుకు ఎకరానికి 10వేల రూపాయలు సాగు సాయం అందించాలని, 50సంవత్సరములు పైబడిన ప్రతి రైతుకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల బోరుబావులకు మీటర్లు బిగించే ఆలోచనను ఉపసంహరించుకొని, నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్తును అందించాలన్నారు. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చుల కు అనుగుణంగా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ ఉపకరణాలు 90 శాతం సబ్సిడీతో రైతులకందించాలని, పెరుగుతున్న పంట ఖర్చులుకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులకు రుణాలు అందించాలని, రైతు కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేసి తిరిగి కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ, బుక్కరాయసముద్రం సిపిఐ మండల కార్యదర్శి మర్రి స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, వెంకటేశు, ఈశ్వరయ్య, ఖలీల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మేం చెరువులు నింపితే.. మీరు తాగునీరు కూడా ఇవ్వరా

- పరిటాల సునీత

మాట్లాడుతున్న పరిటాల సునీత..

విశాలాంధ్ర-రాప్తాడు: గత ప్రభుత్వ హయాంలో మేము అధికారంలో ఉన్నప్పుడు కోట్లు ఖర్చు పెట్టి వందలాది చెరువులు నింపితే.. మీరు.. నీరు పుష్కలంగా ఉన్నా.. ప్రజల గొంతు తడపలేకపోతున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. నగరంలోని మంత్రి నివాసంలో ఆమె శుక్రవారం మాట్లాడుతూ గత వారం రోజులుగా శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకో కపోవడంపై దారుణమన్నారు. జిల్లాలో వందల కోట్లు ఖర్చు పెట్టి శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలు నిర్మిస్తే.. మీరు వాటిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గతంలో కరవు కారణంగా నీరు లేక తాగునీటి సమస్య చూశామని.. అయితే ప్రస్తుతం పుష్కలంగా నీళ్లు ఉన్నా.. కేవలం కార్మికులకు వేతనాలు ఇవ్వలేక ప్రజల గొంతెండేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కింద 572 మంది కార్మికులు పని చేస్తుంటే.. వారికి వేతనాలు ఇవ్వలేకపోతున్నారన్నారు. ఇప్పటికే 5నెలల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి సక్రమంగా చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వచ్చే అరకొర వేతనం కూడా రాకపోతే.. కార్మికుల కుటుంబాలు ఎలా బ్రతుకుతాయని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే వందలాది గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. స్థానికంగా నీరు లేక ప్రజలు పొలాల్లో బోర్ల వద్దకు వెళ్తున్నారన్నారు. కార్మికులు సమ్మె చేస్తుంటే కనీసం ప్రత్యామ్నాయం కూడా ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. జిల్లాలో మంత్రి, ఇంత మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉన్నా ప్రయోజనం ఏమిటన్నారు. కార్మికులకున్న బకాయిలు ఇవ్వాలనుకుంటే ప్రభుత్వానికి అది పెద్ద సమస్య కాదని, కానీ వారి పట్ల చిన్నచూపుతోనే స్పందించడం లేదన్నారు. ఇప్పటికే వందలాది గ్రామాలు గొంతెండిపోతున్నా ప్రభుత్వం స్పందించలేదంటే.. ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే తాము కూడా ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని సునీత హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఏపీ రైతు సంఘం సమరభేరి

విశాలాంధ్ర-యాడికి: ప్రజా సమస్యల పరిష్కారానికి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4 వరకు సమరభేరి నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. శుక్రవారం యాడికి మండల కేంద్రంలోని పలువురి అధికారులకు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాలు సకాలంలో రాకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, పంట ఎండిపోయిన రైతులకు కనీసం ఎకరాకు రూ.50 వేలు, విత్తనం వేయలేని రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం అమలవుతున్న వందరోజుల పని 200 రోజులకు పెంచాలని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తూ వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి పెట్రోల్ డీజిల్ ధరలు నియంత్రించాలని, రూ.400లకే గ్యాస్ ఇస్తూ సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని,రేషన్ షాపుల ద్వారా కందిపప్పు నూనె మొదలగు వాటిని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు గోవిందప్ప, కమిటీ మెంబర్లు కేశవ నాయుడు, సిపిఎం పార్టీ యాడికి మండల కార్యదర్శి బషీర్ అహమ్మద్,టౌను కార్యదర్శి మాయకుంట్ల మోహన్,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కే శ్రీనివాసుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టు సాగు రైతులకు సబ్సిడీలు

విశాలాంధ్ర-రాప్తాడు: పట్టు సాగు చేసే రైతులకు ప్రభుత్వం వివిధ రకాల సబ్సిడీలు మంజూరు చేస్తోందని పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారి డి.ఆంజనేయులు తెలిపారు. వైయస్ఆర్ పట్టుబడి కార్యక్రమాన్ని మండలంలోని బోగినేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఎకరా మల్బరీ పంట నాటేందుకు రూ.18,750, రేరింగ్ షెడ్ నిర్మాణానికి రూ.3లక్షలు, రేరింగ్ షెడ్ పరికరాలకు రూ.37,500 ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రతి నెలా పంటలు తీయడం వల్ల రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. ఈ గ్రామంలో ఒక రైతు మల్బరీ పంటను మేపుతున్నారని ఆయనను ఆదర్శంగా తీసుకుని మిగతా రైతులు కూడా మల్బరీ సాగుకు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి ఉజ్జినప్ప, పట్టు పరిశ్రమ ఉద్యోగులు రామలింగారెడ్డి, ఓబిలేసు, వీహెచ్ఏ సంధ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఈ బి దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ .డా .యుగంధర్. సిబ్బంది శుక్రవారం అనంతపురం పట్టణం సాయినగర్ లోని శ్రీ సాయి మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి ని తనిఖీ చేసి చట్టవిరుద్ధంగా లైసెన్స్ లేకుండా నడుపుతున్నందుకు సీజ్ చేశారు. చంద్ర ఆసుపత్రిలోని మాత్రికా ఇంఫెర్టిలిటీ సెంటర్‌ను సందర్శించి గత ఆగష్టు 22 వ తేదీ జరిగిన మహిళా మృతికి గల కారణాలను విచారించారు. ఎక్స్‌పోర్ట్ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంజీవని ఆసుపత్రిని తనిఖీ చేయగా ఆసుపత్రి యాజమాన్యం ఏడాది కాలంగా రెన్యువల్ చేసుకోనందున మరో నోటీసు అందజేశారు.

గ్రామ సచివాలయం ప్రారంభించిన ప్రభుత్వవిప్...

విశాలాంధ్ర-డి.హీరేహాల్: మండల కేంద్రంలో జెడ్పీటీసీ హసీనా భాను, సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపిపి బళ్ళారి లింగప్ప, ఎంపీటీసీ సభ్యులు దుర్గమ్మ, సుజి మహేష్‌ల ఆధ్యక్షతన దాదాపు 43.60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-2 భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రజలందరికీ లబ్ది చేకూర్చాలనే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ ను తీసుకువచ్చి, ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ భాస్కర్ బాబు, తహశీల్దార్ ఈశ్వర రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ బసవకుమార్, రామ్మోహన్, లక్ష్మినారాయణ, సబ్ ఇనస్పెక్టర్ రంగడు యాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజ్ రాజ్ నాయక్, మండల వైసిపి కన్వీనర్ ఎం. వన్నూరస్వామి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు రవీంద్ర నాథ్ రెడ్డి, మండల సర్పంచ్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కొత్త పింఛన్‌దారుల ధన్యవాదాలు

విశాలాంధ్ర-కణేకల్లు: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయితీ యెర్రగుంట గ్రామ సచివాలయం లో గ్రామ సర్పంచ్ వన్నూరమ్మ అధ్యర్యంలో నూతన పింఛన్ల 14 మంది లబ్ధిదారులకు సర్పంచ్ వన్నూరమ్మ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. వృద్ధులకు, వితంతువులకు 2,750 రూపాయలు, దివ్యాంగులకు 3,000 రూపాయలు ప్రకారం నగదును పంపిణీ చేశారు. అనంతపురం సర్పంచ్ వన్నూరమ్మ మాట్లాడుతూ మన గ్రామంలో ఇప్పటి వరకు 684 మందికి రూ.18,98000 నెల నెలా పింఛను డబ్బులు వాలంటీర్లు ద్వారా అంద జేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు అందరూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విశాలాంధ్ర దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

A.గోపాల్ రెడ్డి అధ్యక్షులు - గొట్లూరు PACS
ధర్మవరం మండలం , శ్రీ సత్యసాయి జిల్లా .

విశాలాంధ్ర దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

క.నాగ ప్రొప్రైటర్ - శ్రీ లక్ష్మివెంకటేశ్వర ఫుడ్ క్యాటర్స్
చెన్నకేశవ స్వామి గుడి దగ్గర , బ్రాహ్మణ వీధి , ధర్మవరం మండలం , శ్రీ సత్యసాయి జిల్లా .

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 2, సెప్టెంబర్ 2023

ఆత్మహత్యలే శరణ్యమంటున్న అన్నదాతలు

▸ ఆరు బోర్లు వేసినా చుక్కనీరు రాని వైనం ▸ ఎన్ పీ కుంటలో లబోదిబోమంటున్న రైతులు

విశాలాంధ్ర-ఎన్ పి కుంట: ఖరీఫ్ సీజన్ లో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు సకాలంలో వర్షాలు కురవక పోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. వేరుశనగ పంట కాపాడుకునేందుకు రైతులు తమ పొలంలో ఎన్ని బోర్లు వేసిన నీరు లభ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోరెడ్డి వారి పల్లి చెందిన రైతు తమ్మతక్క ఉత్తన్న తనకున్న 6 ఎకరాల పొలంలో జూన్ 6 వ తేదీన వేరుశనగ పంటను సాగు చేడు. సాగు చేసిన నాటి నుంచి వర్షం పడకపోవడంతో పంట తీవ్రంగా దెబ్బతినిందని, ఆరు బోర్లు వేశానని బోర్లలో నీరు లభ్యం కాలేదన్నారు. ఒక బోరును వెయ్యి అడుగులకి పైగా వేశానని చుక్క నీరు లభ్యం కాలేదనీ అన్నారు. ఒక బోరులో వస్తున్న కొద్దిపాటి నీరు అరగంట మాత్రమే వచ్చి నిలిచిపోతున్న దని రైతు ఉత్తన్న పేర్కొన్నారు. సాగుకు, బోర్లకు 12 లక్షలకు పైగా అప్పు చేశానని, తీవ్రంగా నష్టపోయా నని రైతు వివరించారు. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేక పోతే ఆత్మహత్యే శరణ్యం అంటున్నాడు. రుణదాతల వేధింపులు తట్టుకోలేకున్నానని వివరించాడు.

ఓటర్ల జాబితా పునః పరిశీలన పక్కాగా చేపట్టాలి

- ఎక్కడా తప్పులు జరగరాదు
- జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

విశాలాంధ్ర-బుక్కపట్నం: తొలగించిన ఓటర్ల జాబితా పునః పరిశీలన ప్రక్రియను పక్కాగా చేపట్టి పారదర్శకమైన ఓటర్ జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులకు సూచించారు. తొలగించిన ఓటర్ల జాబితా పునః పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ శుక్రవారం మండల కేంద్రంలోని షాది మహల్ రైస్ గోడం వెనుక ఉన్న 39 పోలింగ్ క కేంద్రము నందు రాజేశ్వరమ్మ ఇళ్లను, జిల్లా కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. లక్ష్మీదేవి ఇల్లును తనిఖీ చేశారు. బి ఎల్ వోలు మీ ఇంటిని సందర్శించారా లేదా నూతన ఓటర్లను గుర్తించారా లేదా అని వాకబ్ చేశారా ఇంటింటా ఓటర్లసర్వే కార్యక్రమం జరిగిందా లేదా అని రెండు ఓటర్ కార్డులు కలిగి ఉన్నానని వాటిని తొలగించాలని బి ఎల్ ఎల్ కి సంబంధిత ఫారం అందజేయడం జరిగిందని కలెక్టర్ సమాధానం ఇస్తూ త్వరలో మీ ఒక కార్డు రద్దు అవుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ లో మరణించిన కారణంతో తొలగించిన వివిధ ఓటర్లను స్థానిక చుట్టుపక్క ఇళ్లలో ఇంటి వారితో చర్చించి వారి బంధువులతోగ్రామస్తులతోవారు నిజంగా చనిపోయారా లేదా అని అడిగి నిర్ధారించుకున్నారు. ఓటును తొలగించే ధ్రువీకరణ పత్రం మీద వివిధ పార్టీల బిఎల్ఎల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ భాగ్యరేఖ, తాహసిల్దార్ కరుణాకర్, వీఆర్వో కృష్ణయ్య, బి ఎల్ ఓ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులుతో అధిక దిగుబడి పొందాలి

విశాలాంధ్ర - అగళి : వేరుశనగ పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ సూచించారు. మదూడి గ్రామంలో జగదీశ్ సాగు చేసిన వేరుశనగ పంట పొలంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శత్రు మిత్ర పురుగులను వాటి ఉనికిని గ్రహించి చీడ పీడల ఉధృతిని పసిగట్టి పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులను చేసుకొనే విధంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం కార్యకర్తలు వ్యవసాయ శాఖ సిబ్బంది డాక్షయిని గోవిందు మాలేగౌడ కేంపాగౌడ దుర్గమ్మ పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం పొలంబడి నిర్వహింస్తామని, సాగు ఖర్చును తగ్గించి దిగుబడిని పెంచి లాభసాటి వ్యవసాయం చేసుకునే సంపూర్ణమైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

దాతల సహకారంతో అన్నదానం నిర్వహణ సంతోషకరం

- శ్రీ సత్య సాయి సేవా సమితి నిర్వాహకులు

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సకాలంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ నిర్వహణ కార్యక్రమాన్ని దాతల సహాయ సహకారాలతో నిర్వహించుట మాకెంతో సంతోషంగా ఉందని శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు, సేవాదళ్ సభ్యులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం 380 మందికి భోజనపు ప్యాకెట్లను ఆసుపత్రి వైద్యులు, సిస్టర్ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఉన్న గర్భిణీ స్త్రీలకు భోజనపు ప్యాకెట్ తో పాటు స్వీట్లు కూడా ప్రత్యేకంగా పంపిణీ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతగా కీర్తిశేషులు దాసరి తులసమ్మ, వెంకట స్వామి, వారి కుటుంబ సభ్యులు నిర్వహించుట పట్ల వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవ సమితి చేస్తున్న సేవలు అనన్యనీయమని, ఈ అన్నదాన కార్యక్రమం రోగులకు వరం లాగా మారిందని, ఎంతోమంది గ్రామీణ ప్రాంత రోగుల ఆకలిని తీర్చడం నిజంగా అభినందనీయం అన్నారు. సత్యసాయి సేవ సమితి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు 30 మంది పాల్గొన్నారు.

నేడు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో శనివారం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాన్ జన్మదినం సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. తారక రామాపురం లోని బీసీ బాలుర హాస్టల్ నందు పుస్తకాలు, పెన్నులు, ఫ్యాన్లు పంపిణీ, భావన నిర్మాణ కార్మికులతో భోజనాలు-పోతుకుంట రోడ్డు విఆర్ఎల్ ట్రాన్స్పోర్ట్ ఆపోజిట్ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న జన సేన పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఉంటుందన్నారు. గాంధీనగర్‌లో సాయంత్రం 5 గంటలకు పారిశుధ్య కాలనీలో కేక్ కటింగ్ కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు సామాజిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు.

ఘనంగా మధ్య ఆరాధన కార్యక్రమం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో గల శ్రీ రాఘవేంద్ర స్వామి వారి 352 వ ఆరాధన మహోత్సవ వేడుకలు మూడవరోజు శుక్రవారం అత్యంత వైభవంగా భక్తాదులు నడుమ నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి మధ్య ఆరాధన అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ చేశారు. నిర్మాల్య విసర్జన, విశేష పల పంచామృతాభిషేకం, కనక మహా పూజ, అలంకారం, అష్టోదికము లాంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి సాయంత్రం బాబు బాలాజీ గ్రూపు ధర్మారం వారిచే నృత్య ప్రదర్శన తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా వల్లకి సేవలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మతం శాఖ మేనేజర్ రమేష్‌తో పాటు అర్చకులు, భక్తాదులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

వేపాకు అలంకరణతో పెద్దమ్మతల్లి దర్శనం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాలే వీధిలో వెలసిన శ్రీ పెద్దమ్మతల్లి శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తాదులకు వేపాకు అలంకరణతో దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అర్చకులు వెంకటేష్ శర్మ ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం తో పాటు విశేషాలు నిర్వహించిన తదుపరి, వేపాకుతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. మహిళలంతా లలితా సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమం బుగ్గ వంశస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు.

పవర్లూమ్ కార్మిక పోరాట సమితి ఏర్పాటు...

విశాలాంధ్ర-గోరంట్ల: ఏఐటియుసి అనుబంధంగా గోరంట్ల మండల కేంద్రంలో కదిరి రోడ్డు ఎస్కే ఆర్ కాన్వెంట్ సమీపంలో ఏఐటి యుసి పవర్లూమ్స్ కార్మిక పోరాట సమితి అని పవర్లూమ్ కార్మికులందరూ కలిసి సంఘంగా ఏర్పడి ఆ సంఘాన్ని లేబర్ ఆఫీస్ యాక్టు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని బోర్డు ఏర్పాటు చేశామని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు సిపిఐ మండల కార్యదర్శి సుధాకర్ పవర్లూమ్ కార్మిక సంఘం పోరాట సమితి నాయకులు రామకృష్ణ మనోహర సురేష్ మల్లికార్జున శంకర మహేష్ బాబు వెంకటేష్ హాజరయ్యారు. ఏఐటీయూసీ పవర్లూమ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుం దని తెలిపారు. కార్యక్రమంలో మండలంలో ఉన్నటువంటి పవర్ లూమ్స్ కార్మికులందరూ పాల్గొన్నారు.

బిఎస్ఎఫ్ ఉమామహేశ్వర్ ఆకస్మిక మృతి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 25 వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ తమ్ముడు పసల పూజారి ఉమామహేశ్వర్ శుక్రవారం ఢిల్లీలో ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆర్మీలో విధులు కొనసాగిస్తూ మంచి గుర్తింపును పొందడం జరిగిందన్నారు. ఆర్మీలో సెలవులు ఇచ్చినప్పుడు మాత్రమే చెన్నై కొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి వచ్చే వారిని తెలిపారు. ఆయనకు చిన్నతనం నుండే దేశభక్తి అంటే ఎంతో అమితమైన ప్రేమ అని తెలిపారు. పట్టు పట్టి ఆర్మీలో చేరడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం మా తమ్ముడు ఢిల్లీలోని జి 20 విభాగంలో విధులు నిర్వహిస్తుండగా, శుక్రవారం తెల్లవారుజామున చాతి నొప్పి రావడంతో ఆర్మీ ఉద్యోగులు హుటాహుటిన ఢిల్లీలోని ఓ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మాకు ఆర్మీ తెలియజేశారన్నారు. పూజారి ఉమామహేశ్వర్ ఇంత చిన్న వయసులోనే మృతి చెందడం జీర్ణించుకోలేకున్నామని తెలిపారు. పూజారి ఉమామహేశ్వర్ మృదు స్వభావం కలవాడని, అజాతశత్రువుగా మేడాపురంలోనూ, ఢిల్లీలోనూ మంచి పేరున్న వ్యక్తి అని తెలిపారు. అంతేకాకుండా మరణించిన తర్వాత తన రెండు కళ్ళను ఢిల్లీలో నేత్రదానం చేయడం జరిగిందన్నారు. మృతునికి భార్య లలితమ్మ, కుమారులు వంశీకృష్ణ పవన్ లు ఉన్నారు. మేడాపురం గ్రామం అంతా శోక సముద్రంలో మునిగిపోయింది. కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు. పూజారి ఉమామహేశ్వర్ మృతదేహం బెంగళూరు ద్వారా స్వగ్రామం మేడాపురం కు శనివారం తెల్లవారుజామున చేరుతుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు, స్నేహితులు, కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ గృహానికి చేరుకొని తమ సంతాపాన్ని తెలిపారు.

లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం కృషి

డాక్టర్ కోవా లక్ష్మణ్ భాజపా రాజ్యసభ సభ్యుడు

విశాలాంధ్ర-గోరంట్ల: లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని భాజపా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఢిల్లీలోని ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ ఆఫ్ ఆఫ్ సౌత్ ఏషియా 'టెంపుల్ ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర లేపాక్షి' పుస్తకా విష్కరణకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కోవా లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్య కాలం నాటి శిల్పకళ పై మరింత పరిశోధన చేయాలని, ఉన్న వాటిని పరిరక్షించాలని అన్నారు. లేపాక్షి ఆలయం ఒక అద్భుతమైన కళాఖండం అని ఆయన పేర్కొన్నారు. లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేయాలని పుస్తక రచయిత మైనాస్వామి ఆయనను కోరారు . ఈ విషయాన్ని పార్లమెంట్లో చర్చించి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లేపాక్షి ఆలయం పై అద్భుతమైన పరిశోధన చేసిన పుస్తకాన్ని ఆంగ్ల భాషలో తీసుకొచ్చినందుకు రచయిత మైనాస్వామి ని అభినందించారు. ఆలయాలు మరియు సంస్కృతి పై పరిశోధనలు ఎన్నో రావాలని ఆయన ఆకాంక్షించారు. విదేశీ పాలకుల విద్యా విధానం వలన సంస్కృతి మరుగున పడే పరిస్థితులు ఉన్నాయని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. రచయిత మైనాస్వామి మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్య కాలం నాటి ఆలయాలు మరియు శిల్పకళలపై మరింత లోతైన పరిశోధనలు చేయాల్సి ఉంది. విజయనగర సామ్రాజ్య ప్రభువులు, శిల్ప కళాకారుల కృషి ఫలితమే లేపాక్షి ఆలయం అని ఆయన పేర్కొన్నారు. లేపాక్షి పుస్తకాన్ని తెలుగులో,కన్నడ భాషలలో మంచి ఆదరణ లభించింది. తెలుగు పుస్తకాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో, కన్నడ పుస్తకాన్ని బెంగళూరులో ఆవిష్కరించినట్లు తెలిపారు రాయల కాలం నాటి ఆలయాలపై ఉన్న శిల్పాల్లోని నాట్యకళా భంగిమలు, ఇతర అంశాలపై ప్రముఖ కూచిపూడి నాట్య గురువు రాజా రాధా రెడ్డి వీడియో సందేశం ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ ఆఫ్ ఆఫ్ సౌత్ ఏషియా (ఎస్సీసీ) అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్. వెంకటనారాయణ్, రచయిత మైనాస్వామి, పీఆర్ఎస్ఎస్ఐ అధ్యక్షుడు అజిత్ పాఠక్, ఇరెడా ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్ సి జోడిదర్, కూచిపూడి నాట్యగురువు రాధారెడ్డి, ఎస్వీబీసీ డైరెక్టర్ వసంత కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.10 వేల సాగు సహాయం అందించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, బి.మహదేవ్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : సెప్టెంబర్ ఒకటవ తేదీ డిమాండ్స్ డే సందర్భంగా సాగు చేసిన ప్రతి రైతుకు ఎకరాకు పదివేలు సాగు సహాయం అందించాలని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా సకాలంలో వర్షాలు పడకపంటలు దెబ్బ తినడం జరిగిందివేరుశనగ పత్తి వివిధ రకాల పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతినమైనది వర్షాలు రాక ఎండిపోతున్నటువంటి పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని పండిన పంటకు గిట్టుబాటు ధర పెట్టుబడి నిధి కింద ఇవ్వాలని రైతులు కౌలు రైతులు ప్రతిరోజు ఆత్మహత్య చేసుకుంటూనే ఉన్నాయి. 2022 సంవత్సరానికి రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వాగ్దానం అమలు నోచుకోలేదు ప్రజలందరికీ ఆహారాన్ని అందిస్తున్నటువంటి రైతుని ఆదుకోవాల్సిన బాధ్యతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి పంట విపత్తులు, నష్టపరిహారములు మరియు బీమా పరిహారంలో సక్రమంగా రైతులకి అందడం లేదు కావున డిమాండ్స్ డే సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి బాలరాజు సహాయ కార్యదర్శి బి మల్లికార్జున రైతు సంఘం అధ్యక్షుడు పసల నాగరాజు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం

విశాలాంధ్ర-కదిరి: జన సేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని జనసేన పార్టీ నాయకులు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో రక్తదాన, అన్నదాన శిబిరాన్ని జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ కుటాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ ఇంచార్జీ భైరవ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు కాయల చలపతి, పట్టణ కమిటీ సభ్యులు కిన్నెర మహేష్, గోపీనాథ్, హరీష్ వాల్మీకి , హరి బాబు, మండల కన్వీనర్ చిల్లా మహేష్, కొట్టె అశ్వర్థ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-రాప్తాడు: ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని ఐసీడీఎస్ పీడీ టీఎస్ శ్రీదేవి సూచించారు. గంగలకుంట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని సూపర్వైజర్ నాగరత్న ఆధ్వర్యంలో నిర్వహించారు. పోషక విలువల గల ఆహార పదార్థాల గురించి వివరించారు.

జగన్ నిరంకుశత్వానికి నిదర్శనం అయ్యన్న అరెస్టు...

విశాలాంధ్ర-గోరంట్ల: జగన్ నిరంకుశత్వం పరాకాష్ఠకు చేరిందని.. రేపు అధికారం కోల్పోతే తన పరిస్థితి ఏంటో కూడా జగన్ ఆలోచించు కోవాలని తెదేపా యువనాయకుడు నిమ్మల అంబరీష్ హెచ్చరించారు. బలహీనవర్గాలకు చెందిన సీనియర్ నేత, మాజీమంత్రి అయ్యన్నపాత్రుడిని విశాఖలో అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. పోలీసులు తీరుపై తీవ్ర విమర్శలు రావడంతోనే 41ఎ నోటీసులు ఇచ్చి విడుదల చేశారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వాన్ని ఎవరు విమర్శించినా అక్రమంగా అరెస్టు చేస్తున్నారని.. భయాన్ని సృష్టించేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైకాపా మంత్రులు, ఎమ్మెల్యేలు వాడలేని, పలకలేని భాష మాట్లాడుతున్నారని... కొడాలి నాని, వల్లభనేని వంశీ, జోగి రమేశ్, అంబటి రాంబాబు సహా వైకాపా నేతలంతా ఇష్టానుసారం మాట్లాడుతున్నా వారిపై మాత్రం చర్యల్లేవని.. ఇలాంటి వాటికి సీఎం జగన్ సిగ్గుపడాలన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు ఆలోచన అభినందనీయం...

- మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి.

విశాలాంధ్ర-ధర్మవరం: మధ్యాహ్న భోజనపు ఏర్పాటు ఆలోచన రావడం నిజంగా అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యార్థులకు బోధన జరుగుతోందని, ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్చాలని తెలిపారు. ఎంతోమంది ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నతమైన స్థితిలో ఉన్నారని, చదువును నిర్లక్ష్యం చేయకుండా పట్టుదలతో క్రమశిక్షణతో చదివినప్పుడే జీవితంలో మంచి స్థానం కలుగుతుందని తెలిపారు. అనంతపురం నుండి ధర్మవరం కి బదిలీగా వచ్చిన ప్రిన్సిపాల్ ప్రశాంతితో పాటు కళాశాల అభివృద్ధి కమిటీ ఇంటర్ విద్యార్థుల కొరకు ఇటువంటి భోజనం ఏర్పాటు అనేది ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. దాతలు, కమిటీల సహకారంతో ఈ భోజనం ఏర్పాటు సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. నా వంతుగా సహాయ సహకారాలు కూడా అందిస్తానని వారు తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రశాంతి, సిడిసి. చైర్మన్ కోటి లక్ష్మీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ, గురువులను తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, రూపరాజ, పల్లె వేణుగోపాల్, సోమశేఖర్, ప్రసాద్, దేవతా కృష్ణమూర్తి, దాతలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవ సుదర్శన హోమం

▸ శ్రీ గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆగస్టు 30వ తేదీ నుండి సెప్టెంబర్ 1వ తేదీ వరకు మూడు రోజులు పాటు పవిత్రోత్సవ సుదర్శన హోమం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. చివరి రోజు శుక్రవారం మూడవరోజు మధ్యాహ్నం 3 గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమం అర్చకులు సుదర్శన చార్యులు, సునీల్ కుమార్ ఆచార్యులు, ఆలయ కమిటీ భక్తాదులు నడుమ వేదమంత్రాలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, పూర్ణాహుతిని దర్శనం చేసుకొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రెస్ కమిటీ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ సభ్యులు మేటికల కుళ్లాయప్ప, దత్త శివ, శంకర సంజీవులు, బె ళ్లే నాగప్ప, సాగా సురేష్, గుద్దిటి రామాంజనేయులు, రంగా శ్రీనివాసులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మైరాడా భూములు కబ్జా కాకుండా చూడండి

విశాలాంధ్ర - అగళి : హుళ్లేకేరా దేవరాహళ్లి గ్రామ పంచాయితీ గాయత్రి కాలోని సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన "మైరడ్ ప్లాన్" అనే స్వచ్ఛంద సంస్థకు సంబందించిన భూమి ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, వాటిని కాపాడాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. గతంలో మండల ప్రజలకు ప్రభుత్వానికి సమాంతరంగా అభివృద్ధి పనులు చేస్తూ వచ్చిన మైరడా ప్లాన్ సంస్థ వేరే చోటికి తరలివెళ్ళడంతో దానికి సంబధించిన భూమికి కాపలా లేకపోవడంతో ఆక్రమణలు జరుగుతున్నాయని, దయ చేసి ప్రభుత్వం తక్షణమే స్పందించి రెవిన్యూ శాఖ అధీనం లోకి తీసుకోవాలని ప్రజలు కోరారు.

పురపాలక సంఘ కార్యాలయము,
ఆర్.ఓ.సి.నెం.1246-2020-ఏ1, తేది; 01-09-2023, ధర్మవరం.

బహిరంగ వేలం ప్రకటన

ధర్మవరం పురపాలక సంఘ పరిధి నందు కూరగాయల మార్కెట్ మరియు షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి మొదటి అంతస్తు నందు ఉన్న బ్లాక్-1 మరియు బ్లాక్-4 నందు గల 21 షాపు రూములను తేది 08-09-2023న ఉదయం 11-00గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణము నందు బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు ఇతర వివరముల కొరకై మునిసిపల్ కార్యాలయ పనివేళల యందు మునిసిపల్ రెవిన్యూ విభాగము నందు సంప్రదించగలరు.

ఇట్లు
కమీషనరు,
ధర్మవరం పురపాలక సంఘం- 515671
శ్రీ సత్యసాయి జిల్లా